ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 18 మార్చి 2025



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 38.0
కనిష్టం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.21 (మంగళ)
సహరి : 4.47 (బుధ)

తమ్ముళ్లకు షాక్..!



వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు విడుదల

- 2014-19 మధ్య కాలంలో చేసిన వారికి నిల్
- అప్పటి పెండింగ్ బిల్లులు రూ.25 కోట్లు
- తమ ప్రభుత్వం వచ్చినా ఇదేం తీరని అసహనం
- ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తెచ్చిన కేడర్

రాష్ట్ర ప్రభుత్వం తెలుగు తమ్ముళ్లకు షాక్ ఇచ్చిందంటూ టీడీపీ శ్రేణుల మధ్య చర్చ నడుస్తోంది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేసిన పనులకు ఇప్పటికి బిల్లులు మంజూరు కాలేదు. కాని, 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు మాత్రం బిల్లులు విడుదల చేశారు. దీనిపై తెలుగుదేశం కేడర్ కుతకుతలాడుతోంది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

నీరు-చెట్టు పథకం, జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో 2014-19 మధ్య కోట్లాది రూపాయలు పనులు నిర్వహించారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో సీసీ రహదారులు, డ్రెయిన్‌లు నిర్మించారు. నీరు-చెట్టు కింద చెరువులు తవ్వారు. పంట బోదెలకు మరమ్మతులు చేశారు. కాలువల్లో పూడికతీశారు. ఈ పనులకు సంబంధించిన బిల్లులు మాత్రం 2019లో ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. ఉద్దేశపూర్వకంగా బిల్లులు నిలిపివేసింది. దీంతో పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. పనులు చేపట్టిన వారిలో తెలుగుదేశం నాయకులు, సానుభూతిపరులే అధికం. హైకోర్టుకు వెళితే తప్ప, అప్పటి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదు. నాణ్యత పేరిట తనిఖీలు చేసి కొర్రీలు పెట్టింది. విజిలెన్స్ విచారణ చేపట్టింది. బిల్లులు చెల్లించినా పది శాతం తన వద్దే ఉంచుకుంది. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎటువంటి తప్పిదాలు లేవని తేలితే బిల్లులు మంజూరు చేస్తామని చెప్పుకొచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వాటిని విడుదల చేయలేదు. పైగా పనులు చేపట్టేందుకు డిపాజిట్ చేసిన సొమ్ములు ప్రభుత్వం వద్దే ఉండిపోయాయి. ప్రభుత్వం బిల్లుల్లో ఉంచిన పది శాతం బకాయిలు చెల్లిస్తేనే డిపాజిట్ సొమ్ములు విడుదల చేసే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఒక్క నాయకుడు, కార్యకర్తకు గరిష్ఠంగా రూ.35 లక్షల వరకు బకాయి రావాల్సి ఉంది.

వైసీపీ శ్రేణులకు లబ్ధి

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిల విడుదలకు చర్యలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రూ.600 కోట్లు బకాయిలు చెల్లించింది. జిల్లాలో కాంట్రాక్టర్‌లకు పెద్ద మొత్తంలోనే లబ్ధి చేకూరింది. వైసీపీ హయాంలో పనులు చేపట్టిన వారికి మాత్రమే బిల్లులు జమయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలోనే బిల్లులను అప్‌లోడ్ చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం బకాయిలు విడుదల చేస్తే వారికే లబ్ధి చేకూరింది. జిల్లాలో రూ.10 లక్షలలోపు ఉన్న బిల్లులను పరిష్కరించారు. బకాయిలు చెల్లించారు. వైసీపీ ప్రభుత్వంలోనూ ఆ పార్టీ శ్రేణులే పనులు చేపట్టాయి. ఎన్నికల ముందు హడావిడిగా పనులు పూర్తి చేశారు. వారందరికీ బిల్లులు విడుదల కావడంతో సంబరపడిపోయారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన పనులకు పెండింగ్ వున్న బిల్లులు మాత్రం విడుదల కాలేదు. బిల్లులను అప్‌లోడ్ చేసుకోవాలంటూ కొద్దిరోజులు మాత్రమే గడువు ఇచ్చింది. అది కూడా అప్‌లోడ్ కాలేదు. సర్వర్ సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. తీరా వైసీపీ హయాంలో అప్‌లోడ్ అయిన బిల్లులు విడుదలయ్యాయి. దీంతో ఇప్పుడు తెలుగుదేశం నాయకులు, కేడర్ బకాయిలు విడుదల కాక అపసోపాలు పడుతున్నారు. వడ్డీతో సహా బిల్లులు చెల్లిస్తామంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు భరోసా ఇచ్చారు. ఇప్పుడు అసలు రావడం లేదంటూ నాయకులు ఘొల్లు మంటున్నారు.

సమీక్షల్లో ఇదే ప్రశ్న

ముఖ్యమంత్రి చంద్రబాబు కేడర్‌తో నిర్వహించిన సమీక్షల్లోనూ, ఇన్‌ఛార్జ్ మంత్రి నిర్వహించే జిల్లాస్థాయి సమావేశాల్లోనూ ఇదే విషయంపై కేడర్ ప్రశ్నిస్తోంది. బకాయిలపై నిలదీస్తున్నారు. బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్టు అంతా అంగీకరిస్తున్నారు. విడుదల చేస్తామంటూ చెప్పుకొస్తున్నారు. చర్యలు మాత్రం తీసుకోవడం లేదంటూ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలపైన ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్కటిగా బకాయిలు విడుదల చేస్తూ వస్తోంది. దీంతో నీరు చెట్టు, గ్రామీణ ఉపాధి పథకంలో చేపట్టే పనులకు బిల్లులు మంజూరు కాలేదు. దీనికోసం కార్యకర్తలు ఇప్పుడు ఎదురుచూస్తున్నారు.

వరద పనులకు బిల్లుల మంజూరు

భీమవరం, మార్చి 17(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్‌లో అధిక వర్షాల కారణంగా చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేసేలా మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది. జిల్లాలో డ్రెయిన్లు పూడుకుపోయి, గుర్రపు డెక్క, తూడు పేరుకుపోవడంతో పొలాలు నీట మునిగి నారుమళ్లు దెబ్బ తిన్నాయి. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రూ.8 కోట్లతో పనులు చేపట్టి గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టారు. నామినేషన్ పద్ధతిలో పనులు చేసి ముంపు తీవ్రతను అరికట్టారు. ఈ పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కానున్నాయి.

వివాహితపై అత్యాచారం!

- కేసు నమోదు చేయని పోలీసులు
- ఐజీకి ఫిర్యాదు

ఏలూరు క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి):తనపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడులకు పాల్పడి, వీడియోలు తీసి వేధిస్తున్నారని.. ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోగా, తిరిగి కౌంటర్ కేసు వేస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు, కుటుంబ సభ్యులు సోమవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలు తెలిపిన వివరాలివి. ఉండి మండలానికి చెందిన ఓ వివా హితపై అదే మండలం ఎన్ఆర్పీ అగ్రహారానికి చెందిన యర్రంశెట్టి రవి, గుబ్బల సోమేశ్వరరావు (సోము) వేధిస్తూ లైంగిక దాడికి పాల్పడ్డారని, ఆ తర్వాత బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ బీచ్‌కు, భీమవరంలోని స్నేహితుల రూముకు తీసుకెళ్లి లైంగికదాడి జరిపారని ఆరోపించారు. ఆ తర్వాత తనను బెదిరించి దఫదఫాలుగా రూ. రెండున్నర లక్షలు తీసుకుని, మళ్లీ డబ్బు కావాలని వేధిస్తున్నారన్నారు. వేధింపులు భరించలేక ఈ నెల 1న ఉండి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే.. నిందితులపై చర్యలు తీసుకోగ పోగా రాజీ చేసుకోవాలని, లేకుంటే తనపైన, తన భర్త, మరిదిపైన కౌంటర్ కేసు పెడతామని పోలీసులే బెదిరిస్తున్నారని వాపోయింది. ఈ క్రమంలో బాధితురాలు, కుటుంబ సభ్యులు, రజక సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య ఐజీని కలిసి వినతిపత్రం అందించారు. ఐజీ స్పందిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీని విచారణ అధికారిగా నియమించారని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కట్లయ్య తెలిపారు. కె.మురళీకృష్ణ, యలమంచిలి శేషు, యండమూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా గీతాబాయ్

భీమవరం టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యశాఖాధికారిగా డాక్టర్ జి.గీతా బాయ్‌ని నియమిస్తు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ డి.మహేశ్వరరావు గత ఏడాది డిసెంబరు 31వ తేదీన స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి డీఎంహెచ్‌వోగా డాక్టర్ బానునాయక్ వ్యవహరిస్తున్నారు. గీతా బాయ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

లక్షన్నర కొట్టు.. ఉద్యోగం పట్టు!



జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందటానికి కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ వ్యవహారంలో లక్షలాది రూపాయలు చేతులమారినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అక్రమ దందా వెనుక డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారం సోమవారం కలకలాన్నే సృష్టించింది.

- మార్కులు తక్కువ వచ్చినా పర్వాలేదు.. నకిలీ సర్టిఫికెట్లు మేమే సృష్టిస్తాం..!
- వైద్య ఆరోగ్య శాఖలో కొందరు ఉద్యోగుల దందా.. వైసీపీ నేతల ప్రలోభాలు..
- లక్షలు సమర్పించుకున్న అభ్యర్థులు.. ప్రజా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు

అభ్యర్థులు ఏలూరులోని వివిధ పాఠశాలల్లో చదవగా, ఉద్యోగాల నిమిత్తం డీఎంహెచ్‌వో కార్యాలయానికి అందజేసిన విద్యార్హతల సర్టిఫికెట్లలో తాడేపల్లిగూడెం, తదితర ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో చదివినట్టు సృష్టించడంతోపాటు, మార్కులను ఒక్కొక్కరు 500లకు పైగా సాధించినట్టు క్రియేట్ చేసి 'కృత్రిమ మెరిట్'తో మిగతా అభ్యర్థులకంటే ముందు వరుసలో ఉంచినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ మొత్తం వ్యవహారంలో కొందరు వైసీపీ స్థానిక నాయకుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం.

ఏలూరు అర్బన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఈ ఏడాది జనవరి 22న డీఎంహెచ్‌వో పేరిట వెలువడిన నోటిఫికేషన్‌లో కాంట్రాక్టు విధానంలో పది ల్యాబ్ టెక్నీషియన్, ఔట్‌సోర్సింగ్ విధానంలో 30 ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ (ఎఫ్ఎన్‌వో) ఉద్యోగ ఖాళీల భర్తీకి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. అర్హతల వివరాలను నోటిఫికేషన్‌లోనే పేర్కొన్నారు. వాస్తవానికి ఈ ఉద్యోగాల భర్తీ గత నెలలోనే పూర్తికావలసి ఉంది. ఈ లోగా ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి రావడంతో అడ్డంకి ఏర్పడింది. ఈ క్రమంలో దొడ్డి దారిన ఉద్యోగాలను పొందటానికి కొందరు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి, ఆశావహుల నుంచి ఒక్కో ఉద్యోగానికి లక్షన్నర ధర పెట్టారు. మొత్తం 18 మంది ఉద్యోగార్థులు ఈ గ్రూపులోని వ్యక్తులకు అడ్వాన్స్‌గా రూ.50 వేలు ఇచ్చేశారు. మిగతా మొత్తంలో కొంత భాగాన్ని మెరిట్ లిస్టు ఖరారయ్యాక, మిగతా పూర్తి మొత్తాన్ని ఉద్యోగ నియామక పత్రం జారీ అయ్యాక ఇచ్చేలా షరతు పెట్టారు. ఈ నేపథ్యంలో తమకు డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు వచ్చేలా చేయడానికి డీఎం హెచ్‌వో కార్యాలయంలో కొందరిని దారిలోకి తెచ్చు కున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఉద్యోగార్థుల సంఖ్య భారీగా ఉండటంతో దొడ్డి మార్గంలో ఉద్యోగ సాధనకు విద్యార్హతలకు సంబంధించి నకిలీ సర్టిఫికెట్లను




ఎంచుకున్నారు. తమకు డబ్బులిచ్చిన 18 మంది అభ్యర్థులకు విద్యార్హతల నకిలీ సర్టిఫికెట్లను తయారు చేసి, వాటి ఫొటోస్టాట్ కాపీలనే దరఖాస్తులకు జత చేసి సమర్పించారు. అప్పటికే డీఎంహెచ్‌వో కార్యాలయంలో లాలూచీ చేసుకున్న కొందరు ఉద్యోగుల సహకారం ఉండటంతో సంబంధిత నకిలీ విద్యార్హతల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల పేర్లు ప్రొవిజనల్, ఫైనల్ మెరిట్ లిస్టుల దశలను దాటుకుని డీఎంహెచ్‌వో అనుమతితో, జిల్లా సర్వోన్నతాధికారి తుది ఆమోదముద్ర నిమిత్తం వెళ్లిపోయింది. ఇక తుది అనుమతులు వచ్చిన వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు జారీ చేయడమొక్కటే మిగిలింది. ఈ అక్రమ వ్యవహారాన్ని డీఎంహెచ్‌వో దృష్టికి రాకుండా కార్యాలయ ఉద్యోగులు కొందరు నడిపించారు. ఈ అక్రమాల దందాపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా స్పందనలో ఏలూరు వెంక టాపురం వినాయకనగర్‌కు చెందిన సీహెచ్ అర్జునరావు ఫిర్యాదు చేయగా, అక్కడికక్కడే స్పందించిన కలెక్టర్ నేరుగా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినిని పిలిచి తక్షణమే ఈ నియామకాలపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదును పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించారు. దీనిపై వివరణ కోసం డీఎం హెచ్‌వో డాక్టర్ మాలినిని సోమవారం రాత్రి ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి : కలెక్టర్



భీమవరం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):అర్జీల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వచ్చిన 271 అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలను పరిష్కరించి, ప్రభుత్వం ప్రకటించే ర్యాంకుల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులలో ముఖ్యమైన.. పిల్లలతో అద్దె ఇంటిలో వుంటున్న తనకు టిడ్కో ఇల్లు లేదా ఇంటి స్థలం ఇప్పించాలని భీమవరం పట్టణానికి చెందిన తిరుమణి నాగరాణి కోరారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అందులో భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణ మండపాలు నిర్మించి ఆదాయం పొందుతున్నారని, ఈ భూమి స్వాధీనం చేసుకోవాలని గణపవరం మండలం సరిపల్లెకు చెందిన నంద్యాల రామలింగరాజు కోరారు. దిగమర్రు-లోసరి రోడ్డు విస్తరణలో తీసుకున్న తమ భూమికి నష్టపరిహారం ఇప్పించాలని మొగల్తూరు మండలం కొత్తోటకు చెందిన కొప్పనాతి ఏడుకొండలు కోరారు. తన 62 సెంట్ల భూమి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని దీనిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అత్తిలి మండలం బల్లిపాడుకు చెందిన భాషాబత్తుల శ్రీనివాస్ కోరారు. తన అల్లుడు కూతురు ఇంటి దస్తావేజులు తీసుకుని, ఇవ్వకుండా అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని కాళ్ల మండలం వేంపాడుకు చెందిన దాసరి సువర్ణ ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అత్తిలి మండలం స్కిన్నెరపురానికి చెందిన అందే సుబ్రహ్మణ్యం కోరారు. స్మశాన వాటికకు స్థలం సరిపోవడం లేదని, అదనపు స్థలం కేటాయించాలని స్కిన్నెరపురానికి చెందిన ఆకుమర్తి సత్యనారాయణ కోరారు.

అర్జీలు పునరావృతం కాకూడదు : ఎస్పీ



భీమవరం క్రైం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా స్పందనలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త/అత్తింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఆస్తి తగాదాలు, ఇతర పలు సమస్యలపై మొత్తం 11 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అహ్మదున్నీసా, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాధవాయిపాలెం రేవు పాటకు 15 టెండర్ ఫారాల విక్రయాలు

నరసాపురం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవు వేలం పాటకు సంబంధించిన సోమవారం చివరిరోజు 15 మంది పాటదారులు టెండరు ఫారాలను కొనుగోలు చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణంరాజు తెలిపారు. వీరంతా ఈ నెల 21న మండల పరిషత్ కార్యాలయంలో జరిగే పాటలో పాల్గొనాలి. డిపాజిట్ రూ.33 లక్షలు కట్టాలి.

అధ్యక్షా..



దాతల సహకారంతో సీహెచ్‌సీలో డయాలసిస్

ఆకివీడు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : 'వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించక ముందే ఆకివీడు సీహెచ్‌సీలో దాతల నుంచి రూ.65 లక్షలు సేకరించి డయాలసిస్ సెంటర్ జనవరిలో ఏర్పాటు చేశాం' అని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు చెప్పారు. దీనికి మంత్రి స్పందిస్తూ.. 'రఘురామ ప్రభుత్వంపై ఆధారపడకుండా ఆకివీడు సీహెచ్‌సీలో నాలుగు మిషన్లు ఏర్పాటు చేయించారు. వాటికి కావాల్సిన సిబ్బంది, టెక్నీషియన్లను నియమించారు. రాష్ట్రంలో నెఫ్రాలిజిస్టుల కొరత ఉన్నా భీమవరం నుంచి వారానికి రెండుసార్లు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకు ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి' అని కోరారు.



ధాన్యం కమీషన్ సొమ్ము దోచుకున్నారు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సొసైటీ సభ్యులకు చెల్లించాల్సిన ధాన్యం కమీషన్ సొమ్ములను అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు దోచుకున్నారు. ఈ బాపతు కింద రూ.40 కోట్లు స్వాహా చేశారు. దీనిపై నిగ్గు తేల్చేందుకు పెంటపాడు మండలం కొరుమిల్లి సొసైటీలో కమిషన్ వేస్తే రూ.70 లక్షలు దోచుకున్నట్టు లెక్కలు తేలాయి. దర్శిపర్రు సొసైటీలోధాన్యం కమిషన్ సొమ్ముపై కమిషన్ వేయాలని రికమెండ్ చేస్తే నేటికీ ఆ అంశంపై విచారణ చేయలేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని గత ప్రభుత్వంలో రాజకీయ నాయకుల ముసుగులో సొసైటీ సభ్యులకు చెల్లించాల్సిన డివిడెండ్‌లను బొక్కేశారు. వాటన్నింటిని రికవరీ చేసి రైతుల సంక్షేమానికి ఉపయోగించాలి' అని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శాసనసభలో కోరారు.



పీపీపీ మోడల్‌లో పారిశుధ్య నిర్వహణ

తణుకు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) సీఎం చంద్రబాబు తణుకులో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం చేప ట్టారు. తగిన వనరులు, పరికరాలు, డంపింగ్ యార్డుకు తగిన స్థలం లేకపోతే ప్రభుత్వం ఆశించిన ఫలితం రాదు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం తో అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణను పీపీపీ మోడల్‌లో చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది' అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ శాసనమండలిలో చెప్పారు.



భీమవరం పరీక్ష కేంద్రంలో కలెక్టర్ నాగరాణి తనిఖీ

టెన్త్ పరీక్షలు ప్రశాంతం




భీమవరం పరీక్ష కేంద్రంలోకి పంపేందుకు విద్యార్థినులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

భీమవరం రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తొలిరోజు సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ఉదయం 9.30 గంటలకు ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. 8.45 గంటల నుంచి వారిని లోనికి అనుమతించారు. జిల్లాలో 128 కేంద్రాల్లో తొలిరోజు ప్రథమ భాష పరీక్ష జరిగింది. 22,692 మంది విద్యార్థులకు 22091 హాజరయ్యారు. 601 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని డీఈవో నారాయణ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 46 కేంద్రాలు, కలెక్టర్ ఒక కేంద్రం, జిల్లా స్థాయి పరిశీలకులు నాలు కేంద్రాలు, డీఈవో ఐదు కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ నాలుగు, మొత్తం 60 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

లోటు పాట్లు ఉండకూడదు : కలెక్టర్

పదో తరగతి పరీక్షల నిర్వహణను ఎటువంటి లోటు పాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. సోమవారం భీమవరం శ్రీచింతలపాటి బాపిరాజు స్మారకోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నెంబరు 08816-297200కు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కాల్ చేయవచ్చునని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, 100 మీటర్ల దూరంలో జిరాక్స్ సెంటర్లు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తెరవకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



దేవదాయ శాఖ జిల్లా అధికారిగా సూర్యప్రకాశ్

భీమవరం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి):దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్‌గా వి.హరిసూర్యప్రకాశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మావుళ్లమ్మ ఆలయ ఈవోగా, నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయ సహాయ కమిషనర్‌గా, పని చేశారు. అక్కడి నుంచి బదిలీపై భీమవరం జిల్లా అధికారిగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఈవీ సుబ్బారావును కాకినాడ సహాయ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఇక్కడకు వచ్చిన సూర్యప్రకాశ్‌కు మావుళ్ళమ్మ ఆలయ ఈవో మహాలక్ష్మి నగేష్, సోమేశ్వరస్వామి ఈవో రామకృష్ణంరాజు, ఇనస్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు తదితరులు స్వాగతం పలికారు.




మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో హీరో నితిన్‌కు ప్రసాదం అందిస్తున్న ఆలయ పర్యవేక్షకుడు జవ్వాది కృష్ణ... గుబ్బల మంగమ్మతల్లి ని దర్శించుకున్న నితిన్

మద్ది ఆంజనేయునికి హీరో నితిన్ పూజలు

జంగారెడ్డిగూడెం/ బుట్టాయగూడెం మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని సినీ హీరో నితిన్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆలయ పర్యవేక్షకుడు జవ్వాది కృష్ణ స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందించారు. హీరో నితిన్‌తో పాటు మైత్రి మూవీస్ అధినేత రవి శంకర్, దర్శకుడు వెంకీ కుడముల పాల్గొన్నారు. గుబ్బల మంగమ్మతల్లికి సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉన్నవారు నితిన్ చూసేందుకు ఎగబడ్డారు.

చిన వెంకన్న హుండీ ఆదాయం రూ1.75 కోట్లు



ద్వారకాతిరుమల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న హుండీల లెక్కింపు ద్వారా భారీ ఆదాయం సమకూరింది. 18 రోజుల కాలానికి గాను జరిగిన ఈ లెక్కింపులో శ్రీవారికి నగదు రూపేణా రూ.1.75 కోట్ల రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈవో ఎన్వీ సత్యనా రాయణమూర్తి తెలిపారు. ప్రమోద కల్యాణ మండప ఆవరణలో సోమవారం భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా 1,75,65,133 రూపాయల నగదుతో పాటు కానుకల రూపేణా 137 గ్రాముల బంగారం, 3.1305 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. రద్దయిన పాతనోట్లు రూ.500 (13), 1000(5) 2000 (3)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం లభించింది.

భీమవరంలో హోరాహోరీగా టెన్నిస్ పోటీలు




భీమవరం అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) :భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న ఆలిండియ సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు సోమవారం హోరాహోరీగా సాగాయి. 5 విభాగాలలో జరిగిన పోటీలలో విజేతలుగా వీరు ఉన్నారు. 35+సింగిల్స్ విజేతలుగా గణష్ హోసన్న, అశోక్‌రెడ్డి, నాగరెడ్డి, నితీష్ జాక్సన్,డా. అశ్వీన్ కుమార్‌లు నిలిచారు. 45+విభాగంలో కే సంపత్, గంజీ వెంకటేశ్వర్లు, ఎంఎస్ కిరణ్, శివకుమార్‌రాజు, సుబ్రమనియన్ గోపాల కృష్ణ, విజయం సాధించారు. 55+సింగిల్స్‌లో ఆయుదేసిష్, రాత్, కోటేశ్వరరావు కుంభా, బాబు రాజన్, మణికంఠన్, రెడ్డి రామకృష్ణలు నిలిచారు. 65+ విభాగంలో శ్రీనివాస్ రెడ్డి, రంజిత్‌లంకా, పాల్ చంద్రా, ధనాంజనేయులు, గెలుపొందారు. 70+ విభాగంలో సెటు, బీఎల్ఎన్ రాజు, బీజీ రెడ్డిలు విజేతలుగా నిలిచారని టెన్నిస్ అసోసి యేషన్ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు తెలిపారు.

కుక్కునూరు-భద్రాచలం రహదారి పనులు ప్రారంభం



కుక్కునూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు భద్రాచలం రహదారి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. కుక్కునూరు, భద్రాచలం, అశ్వారావుపేట 40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి దాదాపు రూ.36 కోట్లు నిధులు మంజూరయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పనులు ప్రారంభం కాగా సాంకేతిక లోపం కారణంగా దాదాపు మూడేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 40 కిలోమీటర్ల మేర రహదారి తవ్వి వెట్‌మిక్స్‌ను వేశారు. అయితే చేసిన పనికి దాదాపు ఏడు న్నర కోట్లు బిల్లు రావల్సి ఉంది. బిల్లు రాకపో వడంతో నాలుగు నెలలుగా సంబంధిత కాంట్రాక్టరు పనులు నిలిపివేశాడు. ఇదే సమయంలో సదరు కాంట్రా క్టర్‌కి తెలంగాణలో చేసిన పనికి గానూ బిల్లు రావడంతో ప్రస్తుతం మళ్లీ కుక్కునూరు, భద్రా చలం రహదారి పనులు ప్రారంభించినట్లు సమాచారం.

విద్యా గణపతికి పెన్నులతో అలంకారం



భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :పదో తరగతి పరీక్షలు పురస్కరించుకుని విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షిస్తూ సోమవారం గునుపూడి ఉమా సోమేశ్వర భీమవరం బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో విద్యా గణపతికి పెన్నులతో అలంకారం చేశారు. దాతలు వేలూరి శ్రీధర్, మాదిరెడ్డి శ్రీనివాసులు అందించిన పెన్నులు,పెన్సిళ్లు, స్కేళ్లతో స్వామివారిని అలంకరించారు. అనంతరం విద్యార్థులకు అందించారు. అధ్యక్షుడు వేలూరి సత్యహనుమ కిరణ్ చంద్రా, మారెళ్ళ అఖిలేష్, వేలూరి శేషగిరిరావు, మదిరి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



కబ్జా కోరల్లో..



వేగిలింగేశ్వరస్వామి చెరువు ఆక్రమించి నిర్మించిన కట్టడాలు

చెరువులు..కుంటలు కనుమరుగు
ఆక్రమించి నివాసాలు నిర్మాణం
పట్టించుకోని అధికారులు
ఇలా అయితే పర్యావరణానికి హాని

చింతలపూడి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలోని చెరువులు ఆక్రమించి నివాస గృహాలు నిర్మిస్తుండగా కుంట చెరువులు కబ్జాలకు గురవుతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ చెరువుల దిగువున సాగు విస్తీర్ణం లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. నగర పంచాయతీలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఏడు చెరువులు, 18 కుంట చెరువులు ఉన్నాయి. ఇందులో నడిబొడ్డున ఉన్న మొహిద్దీన్‌కుంట చెరువు, వేగిలింగేశ్వరస్వామి చెరువు సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. వీటి దిగువన ఉన్న పంట భూములు భవన నిర్మాణాలతో నిండిపోయింది. సాగు భూమి ఎకరం కూడా లేదు. దీంతో చెరువులను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేశారు. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోయింది. మేజర్ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి ఈ విధమైన నిర్మాణాలు జరుపుతున్నా పట్టించుకున్న అధికారి లేరు. నడిబొడ్డున ఉన్న మరో పెద్ద చెరువు ఆక్రమణలకు గురై కలుషితమవుతోంది. ఈ చెరువులో ఇప్పటికే బ్యాక్ వాటర్‌లో బైపాస్ రోడ్డు నిర్మించారు. ఇది ప్రజలకు ఉపయోగపడినా దీనిని ఆసరాగా తీసుకుని చెరువును పూడ్చి రియల్ ఎస్టేట్ దారి కోసం రోడ్డు కూడా నిర్మించారు. కళ్లకు కనిపిస్తున్నా నీటిపారుదల శాఖగాని, మునిసిపల్ అధికారులు గాని పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. బోయగూడెం చెరువు కాలుష్యానికి గురవుతోంది. నగర పంచాయతీలో సుమారు తొమ్మిది వేల గృహాలు ఉన్నాయి. ఇళ్ల నుంచి వెళ్లే మురుగునీరు ఈ చెరువులు, కుంటల్లోకి వెళ్లి కాలుష్యానికి గురి చేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, కోళ్లవ్యర్థాలు ఈ చెరువు అంచుల్లో వదిలేస్తున్నారు. పట్టణంలో ఉన్న మిగిలిన చెరువులు తాడిబంధం చెరువు, ఈడిగాడిచెరువు, కొత్తచెరువుతో పాటు రావి కొయ్యికుంట, నాచుకుంట, మాదిగకుంట కబ్జాకు గురయ్యాయి. ఇంకా 15 కుంట చెరువులు కూడా సరిహద్దులు, రికార్డుల ప్రకారం కనిపిస్తున్నా ఇవి ఎక్కడ ఉన్నాయో రెవెన్యూ శాఖే తేల్చాలి. పెరుగుతున్న పట్టణ జనాభాకు వాహనాల నిలుపుదల కోసం, ప్రభుత్వ కార్యాలయాల కోసం ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా మునిసిపల్ పరిధిలో స్థలాల కొరత తీవ్రంగా ఉంది. నగర పంచాయతీలో ఇప్పటికే పార్కు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా చేపట్టలేదు. వేగిలింగేశ్వర స్వామి చెరువు గట్టునే సుందరీకరణ పేరుతో నిధులు ఖర్చు చేశారు. ఈ పథకం ఇప్పటివరకు ప్రారంభం కూడా కాలేదు. ఇక లారీలు, టాక్సీలు, మినీ వ్యానులు, ఆటోలు, విపరీతంగా పెరిగాయి. వీటిని రోడ్లపక్కనే నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. లారీ యజమానులు అసోసియేషన్ తరఫున పలుమార్లు నగర పంచాయతీ, రెవెన్యూ అధికారులకు వాహనాల నిలుపుదలకు స్థలం చూపించాలని విజ్ఞాపనలు ఇచ్చారు. ఇంతవరకు వారికి స్థలాలు కూడా కేటాయించలేకపోయారు.పట్టణ శివారు మూడు కిలోమీటర్ల దూరంలో ఒక ప్రైవేటు భూమిని అద్దెకు తీసుకుని లారీలు నిలుపుదల చేసుకుంటున్నారు. ఈ చెరువులు, కుంటలు వాల్టా చట్టం ప్రకారం సరిహద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగిస్తే నీటి నిల్వ పెరిగి పర్యావరణ సమతుల్యం ఏర్పడుతుందని స్థానికులు కోరుతున్నారు.



మొహిద్దీన్‌కుంట చెరువులో ఆక్రమించి నిర్మించిన ఇళ్లు

మూడు కుంటలు కబ్జా చేసి పట్టాలు పుట్టించారు



నగర పంచాయతీలో చిన్నచిన్న కుంట చెరువులు ఆక్రమిస్తున్నారు. మూడు కుంటలను ఆక్రమించి పట్టాలను కూడా పుట్టించారు. కుంటలు, చెరువులు కాపాడుకుంటేనే పర్యా వరణం బాగుంటుంది. చెరువులు కలుషితం కాకుండా పర్యవేక్షణ చేయాలి. ఒకప్పుడు ఈ చెరువుల్లో నీటినే మంచినీరుగా వినియోగించే వారు. ఇప్పుడు కలుషితమైన చెరువు చూస్తుంటే కళ్ల వెంట నీళ్లొస్తున్నాయి.

- టి.బాబు, సీపీఐ నాయకుడు, చింతలపూడి

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం



నగర పంచాయతీలో చెరువులు, కుంటలపై సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను కోరు తున్నాం. ప్రస్తుతం రీసర్వే కార్యక్రమాల వల్ల సిబ్బంది కొరత ఉందని చెబుతున్నారు. ఒకటి, రెండు నెలల్లో వీటిపై మరోసారి ఆ శాఖ దృష్టికి తెచ్చి వీటిపై సరిహద్దులు సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి వీటిని కాపాడుకోవడానికి చర్యలు తీసుకుంటాం.

- డి.పావని, మునిసిపల్ కమిషనర్, చింతలపూడి

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కేసుల పరిష్కారానికి మధ్య వర్తిత్వం చక్కటి మార్గమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో న్యాయవాదులకు ఐదురోజు పాటు శిక్షణా తరగతులను ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న ఏలూరు బార్ అసోసియేషన్ భవనంలో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎంపికైన న్యాయవాదులకు శిక్షణ ఇవ్వడం ద్వారా కక్షిదారులకు సేవలను మరింత త్వరితగతిన అందించే అవకాశం ఉంటుందన్నారు. కేసుల త్వరితగతిన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెండవ అదనపు జిల్లా జడ్జి మంగాకుమారి, ఐదవ అదనపు జిల్లా జడ్జి రాజేశ్వరి, డీఎల్ఎస్‌కె కార్యదర్శి రత్నప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారామ్ పాల్గొన్నారు.



చిగురు మేఘం నాటికలోని రసవత్తరమైన సన్నివేశం

ఆసక్తి రేకెత్తిస్తున్న నాటికలు

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో 3వ రోజు 2 నాటికల ప్రదర్శన

పాలకొల్లు అర్బన్, , మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు కళాపరిషత్ 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ నాటికల పోటీల్లో మూడో రోజు సోమవారం రెండు నాటికలను ప్రదర్శించారు. చిగురు మేఘం, బ్రహ్మస్వరూపం నాటికలను ప్రదర్శించారు. ఆధునిక వైద్యం సామాన్యుడికి అందుబాటులో లేకపోవడం, డబ్బు సంపాదనే ధ్యేయంగా విలువలు కోల్పోయిన కార్పొరేట్ హాస్పటల్స్ తీరును విమర్శనాత్మకంగా వినూత్నంగా ప్రదర్శించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డిగ్రీ చేసిన తరువాత సామాన్యులకు సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేస్తారు. కానీ ఓ కార్పొరేట్ ఆసుపత్రి అధిపతిని వివాహం చేసుకుని సంపాదనే ధ్యేయంగా ఉన్న డాక్టర్‌ని బీదరికంలో ఉన్న తల్లిదండ్రులు చాలా ఏళ్ళ తరువాత కలవడం, రోగాల పాలైన తల్లి డాక్టర్ చేతిలో చనిపోవడంతో డాక్టర్‌లో మార్పుకు బీజం పడుతుంది. డాక్టర్‌గా తాను చేసిన పనికి పశ్చాత్తాపపడి తన తల్లి వంటి వారు గ్రామాల్లో ఎందరో ఉన్నారని తెలుసుకుని గ్రామాల్లో వైద్యం చేయడానికి డాక్టర్ వెళ్ళడంతో కథ ముగుస్తుంది. గుంటూరు అమరావతి ఆర్ట్స్ ప్రదర్శించిన నాటికను కావూరి సత్య నారాయణ రచన చేయగా యేపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటికలో మంచితనం వికసిస్తున్నప్పుడు అందరూ మంచివారిగానే కనిపిస్తారు, మంచివారు ప్రపంచం చాలా గొప్పగా ఉంటుంది. ఆ ప్రపంచంలో మనకు ఆత్మీయతలు, అభిమానాలు, మమకారాలు, మాధుర్యాలు కనిపిస్తూంటాయి. స్వచ్ఛమైన అనుభూతులు చూడగలిగితే మనకు నచ్చిన జీవితం మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. అలాంటి ప్రభావంతో గుండెను తడిచేసే సంఘటనలు జ్ఞాపకాలుగా మిగిలిపోయే సందర్భాలు ఈ నాటికలో మనల్ని స్పృశిస్తాయి. కానీ ఒక్కోసారి అలాటి అహ్లాదకరమైన జీవి కఠినమైన సందర్భాలలో విధి విరోధిగా మారిన వేళల్లో మనం నిస్సాహాయులుగా మిగిలి పోతున్నప్పుడు సాక్షాత్తు ఆ బ్రహ్మ స్వరూపమే ఆవహించి, ధర్మాన్ని చెబుతుంది. ఈ కథ ముగింపు కూడా అదేవిధంగా ఉంటుంది. రచన శ్రీ స్నిగ్ధ కాగా పురుషోత్తం దర్శకత్వం వహించారు.



బ్రహ్మస్వరూపం నాటికలోని దృశ్యం

సీటీ స్కాన్‌కు సుస్తీ..!

క్షతగాత్రులను విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తున్న ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు



ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి ప్రమాద పరిస్థితిలో రోగులు వచ్చారంటే వారికి వైద్య సేవలు అందించకుండా సీటీ స్కాన్ పనిచేయడం లేదంటూ విజయవాడ, గుంటూరులకు రిఫర్ చేసేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ మిషన్లను ఎస్ఆర్ఐ సంస్థ నిర్వహిస్తోంది. ఈనెల 15వ తేదీ నుంచి సీటీ స్కాన్ మిషన్ పనిచేయడం లేదు. ఏదైనా రోడ్డు ప్రమాద బాధితులు ఆసుపత్రికి వచ్చారంటే వారికి తలకు దెబ్బ ఉందని తెలిపినా, శరీరంలో దెబ్బలు తగిలాయని చెప్పినా మరుక్షణమే ఇక్కడ సీటీస్కాన్ మిషన్ పని చేయడం లేదని విజయవాడ, గుంటూరుకు వెళ్ళి స్కానింగ్ చేయించు కోవాలని చెబుతున్నారు. వాస్తవానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ఎక్స్‌రే ద్వారా ప్రాథమికంగా శరీరం లోపల ఉన్న గాయాలను గుర్తించవచ్చు. కానీ సీటీస్కాన్ పనిచేయడం లేదని అసలు వైద్యం చేకుండానే పంపేస్తున్నారు. ఎంఆర్ఐ మిషన్ పనిచేస్తున్నది. అత్యవసర పరిస్థితుల్లో ఎంఆర్ఐ ద్వారా స్కాన్ చేసి వైద్య సేవలందించవచ్చు. ఇటీవల ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్‌లో జరిగిన ఆర్టీసీ ప్రమా దంలో క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వా స్పత్రికి తీసుకురాగా వారిని 108 అంబులెన్సు నగరంలో ఉన్న ఓ ప్రైవేటు సీటీ స్కాన్ సెంటర్‌కు తరలించారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించి ఆసుపత్రిలోనే సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

జీడిమామిడి ఎక్కడ?



అంతరించిపోతున్న జీడిమామిడి చెట్లు
తగ్గిన దిగుబడులు
పడిపోయిన సాగు విస్తీర్ణం

మొగల్తూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): విదేశీ మారకద్రవ్యం ఆర్జించి పెట్టే పంట జీడి మామిడి. ఇసుక నేలలు, కొండప్రాంతాల్లో తేమ శాతం ఎక్కువగా ఉండే ఉష్ణమండల వాతావరణంలో ఈ తోటలు పెంపకానికి అనుకూల ప్రాంతాలు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ కోస్తాతీరం వెంబడి ఈ తోటలు విస్తారంగా ఉండేవి. జీడి పంట నుంచి వచ్చే జీడిపప్పు వినియోగం పెరుగుతూ ఉండటంతో రైతు స్థాయిలో వర్షాధారంగా సాగుచేసే అవకాశం ఉన్నందున ఈ సాగు ఎక్కువ ఆదరణ పొందింది. అయితే ఇటీవల ఈ తోటల్లో యాజమాన్య లోపాల కారణంగా దిగుబడులు లేకపోవడం, జీడిపండుకు ధర లేకపోవడంతో పాటు జీడిపిక్కల దిగుబడి ఆశాజనకంగా లేదు. ఒకప్పుడు ఒక్కొక్క చెట్టుకు సుమారు 8 నుంచి 10 కిలోల పంట దిగుబడి వచ్చేది. ఇప్పుడు యాజమాన్య లోపాలు, సాగుపై రైతులకు అవగాహన లేకపోవడం వంటి కారణాలతో పాటు ఎక్కువ భూభాగాన్ని ఈ చెట్లు ఆక్రమించుకోవడం, జీడిపిక్కలు కోయడం, పెరిగిన కూలి ధరల కారణంగా పంట లాభదాయకంగా లేదు. ఒకప్పుడు విస్తారంగా ఉండే జీడితోటలు నేడు అంతరించిపోతున్నాయి. పశ్చిమ తీరంలో వచ్చే దిగుబడిని రాష్ట్రంలో గల 18 జీడిపప్పు ఫ్యాక్టరీలకు రైతులు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం జీడిగింజను ఎండబెట్టి ఒబ్బిడి చేసే పరిస్థితి లేకపోవడంతో పచ్చి జీడిగింజలనే విక్రయిస్తున్నారు. మార్చి నెల నుంచి మే నెల వరకూ ఈ జీడి పిక్కలు దిగుబడికి వస్తాయి. ప్రస్తుతం మొగల్తూరు మార్కెట్‌లో కిలో పచ్చి జీడి గింజలు రూ.180 నుంచి 200లకు విక్రయిస్తున్నారు. డిమాండ్ ఉన్న ఈ జీడి సాగును ప్రభుత్వ ప్రోత్సహించి రైతులకు నాణ్యమైన అంట్లును సరఫరా చేసి ఉపాధి హమీ పథకం నుంచి మొక్కలు నాటేందుకు, మొక్కలు పెంపకానికి, పంట కోయడానికి కూలీలను ఏర్పాటు చేస్తే పశ్చిమ తీరంలో ఈ సాగు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మొగల్తూరులోని జీడిమామిడి తోటలు

జీడిపండుతో ప్రయోజనాలు

వేసవి కాలంలో వచ్చే అధిక దాహార్తిని జీడి పండు నివారిస్తుంది. జీడిపండును తినడం వల్ల వేసవిలో శరీరంలోని చెమటి నుంచి వచ్చే జిగురు నివారణ కావడంతో శరీరంలోని అధిక వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వీటిని తినడం వల్ల దగ్గు, కఫం తగ్గి వేసవిలో మంచి ఆరోగ్యం కలుగుతుంది.

జీడిపప్పుతో ఆరోగ్యం

జీడిపప్పు తినడం వల్ల మానసిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆందోళన, నిరాశ తగ్గిస్తుంది. జీడిపప్పులోని పోషకాలు రక్తంలో చక్కర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. జీడిపప్పులో ఉండే కాపర్, జింక్ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. జీడిపప్పులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వును అందించడం, మెదడు ఆరోగ్యానికి తోడ్పడటం, బరువు నిర్వహణలో సహాయపడుతుంది.

భలే..భలే జీళ్లు



తిరునాళ్లలో ఇవి ఉండాల్సిందే..
సంప్రదాయంగా కొనసాగుతున్న వ్యాపారం
పెరిగిన ఖర్చులతో తగ్గిన అమ్మకాలు
తినేవారూ తగ్గిపోయారు
కనుమరుగవుతున్న జీళ్ల తయారీ

గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జాతరలు, ఉత్సవాలు, తిరునాళ్లలో ప్రధానంగా దర్శనమిచ్చేవి జీళ్లే.. తియ్యతియ్యని, కమ్మని జీళ్ల తయారీ వ్యాపారం వంశ పారంపర్యంగా కొనసాగుతూ వస్తున్నది. గ్రామాల్లో ఏదైనా ఉత్సవం జరిగిందంటే చాలు ఇంటింటా జీళ్ళతో నోరుతీపి చేసుకోవాల్సిందే. అనాదిగా వస్తున్న జీళ్ల వ్యాపారం కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీళ్లలో రెండు రకాలు. ఒకటి పిండి జీళ్లు.. ఇవి నోట్లో వేసుకున్న వెంటనే కరిగిపోతాయి. రెండవది సాగుడు జీళ్ళు ఇది నోట్లో వేశామంటే సాగుతూనే ఉంటాయి. గతంలో ఈ వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా ఉండేది. తిరునాళ్ళలో వీటికి డిమాండ్ చాలా అధికంగా ఉండేది. రానురాను జీళ్ల తినేవారి సంఖ్య తగ్గిపోతుంది. పెరిగిన ధరల నేపథ్యంలో జీళ్ల తయారు చేసేందుకు వ్యాపారులు కూడా వెనుకడుగు వేస్తున్నారు. వారికి గిట్టుబాటు కావడం లేదు.



జీళ్లు తయారు చేస్తున్న దృశ్యం

తగ్గిన అమ్మకాలు

ఉభయ గోదావరి జిల్లాల్లో జీళ్ల తయారీదారులు వందల సంఖ్యలో ఉండేవారు. అయితే గడిచిన సుబ్రహ్మణ్యషష్టి నుంచి భీమవరం మావుళ్ళమ్మ ఉత్సవాల్లో అలాగే ఇటీవల జరిగిన కొల్లేటి పెద్దింటమ్మ ఉత్సవాలు, శివరాత్రికి బలివే ఉత్సవాల్లో, ఉంగుటూరు, భీమడోలులోని ముగ్గురమ్మల జాతరలో ప్రస్తుతం గణపవరం దండు మారెమ్మ ఉత్సవాలు, అలాగే పిప్పర ముగ్గురమ్మ తిరునాళ్ళలో కూడా గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న జాతరలకు కూడా జీళ్లు వేసేవారు. జీళ్ళ వ్యాపారం చేసేవారు. మధురమైన జీళ్ళను, రుచికరమైన మాటలు కలిపి అమ్ముతుంటారు. రానురాను జీళ్లు తినటం తగ్గటంతో వ్యాపారం సన్నగిల్లుతున్నది. దీంతో వ్యాపారులు కూడా చేసేందుకు ముందుకు రావడం లేదు.

పెరిగిన ఖర్చులు.. తగ్గిన ఆదాయం

జీళ్ల అమ్మటానికి, తయారీకి నలుగురు మనుషులు అవసరం అవుతారు. నలుగురు మనుషుల జీతాలకు రూ.6 వేలు ఖర్చవుతుంది. అదే ఇద్దరైతే రూ.3 వేలు అవుతుంది. ఈ రకంగా ఖర్చులు పోను ఆదాయం లభించడం లేదంటున్నారు. మరోపక్క బెల్లం ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. బెల్లం నంబర్ వన్ రకం కిలో రూ.55 వరకు ఉంటుంది. నేతిజీళ్ళు కిలో రూ.250, సాదావి రూ.200లకు విక్రయిస్తున్నారు.సరైన ఆదాయం లేకపోవడంతో వ్యాపారులు ముందుకు సాగడం లేదు.



వినతిపత్రం ఇస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ధర్నాలో పాల్గొన్న ప్రజలు

టిడ్కో గృహ సముదాయాలు

లబ్ధిదారులకు స్వాధీనం చేయండి

కలెక్టరేట్ వద్ద సీపీఎం మహాధర్నా

భీమవరం అర్బన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్ల సమస్యలను తక్షణం పరిష్కరించ పోతే ఉద్యమం ఉధృతం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మార్చి 8 నుంచి 16 వరకు సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా సోమవారం భీమవరంలోని కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేపట్టారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణం స్వాధీనం చేయాలని నినదించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 20వేల పైగా టిడ్కో ఇళ్లు ఉన్నాయని, ఎక్కడా కనీస సౌకర్యాలు లేవని మండిపడ్డారు. ప్రజల డబ్బుతో కట్టించి ప్రజలకు స్వాధీనం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేయకపోతే తామే పేదలను తీసుకెళ్లి స్వాధీనం చేసుకోవాల్సి వస్తుందన్నారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ కాలనీలు ప్రతిపక్ష కాలనీలుగా మారుతున్నాయన్నారు. టిడ్కో ఇళ్లను ఒక ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఇప్పుడున్న కాలనీలను ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనంతరం డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా హౌసింగ్ డీఈ ఈ.రమణకు వినతిపత్రం అందించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బలరాం, చింతకాయల బాబురావు, కౌరు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, పీవీ.ప్రతాప్, దూసి కళ్యాణి, క్రాంతిబాబు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కె.రాజారామ్మోహన్‌రాయ్, జుత్తిగ నర్సింహమూర్తి, బాలం విజయకుమార్, బొక్కా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పశు బీమా అమలు



గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు జీవనాధరంగా జీవిస్తుంటారు. వారి జీవనోపాధికి భరోసాగా ప్రభుత్వం పశు బీమా పథకాన్ని పునరుద్ధరించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీమా పథకం రైతులను ఆదుకుంది. అనంతరం వైసీపీ ప్రభుత్వం తరువాత అరకొరగా బీమా చెల్లించి చేతులు దులుపేసుకుంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ నెల 1 నుంచి బీమా పథకం పునరుద్ధరించి ప్రీమియం మొత్తాన్ని కూడా విడుదల చేసింది.

- వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం
- పునరుద్ధరించిన టీడీపీ ప్రభుత్వం
- ప్రీమియంలో 80 శాతం రాయితీ
- మూడేళ్లకు రూ.192 ప్రీమియం

ఏలూరు టూటౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ కొందరికి జీవనాధారం. ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే ఆయా కుటుంబాలకు ఆర్థిక నష్టం తప్పదు. పాడిరైతుల కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని తిరిగి ప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీమా పథకం ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకుంది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అరకొరగా బీమా చెల్లించి చేతులు దులుపుకుంది. పశువులను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కూటమి ప్రభుత్వం పశుబీమా పథకాన్ని పునః ప్రారంభించింది.

ఏలూరు జిల్లాకు రూ.11లక్షలు పశుబీమా ప్రీమియం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 1నుంచి ప్రారంభమైన ఈ పథకంలో 350మంది రైతులు తమ పశువులకు బీమా చేయించారు. బీమా ప్రీమియంలో 80శాతం ప్రభుత్వ సబ్సిడీ కాగా 20 శాతం రైతులు చెల్లించాలి. ఒక కుటుంబానికి 5 పశువుల వరకు బీమా వర్తిస్తుంది.

మేలు జాతి ఆవులు, గేదెలకు రూ.30వేలు నాటుగేదెలు, ఆవులకు రూ.15వేలు బీమా చెల్లిస్తారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పశుపోషకులకు బీమాలో 80శాతం రాయితీ ఇస్తున్నారు. నాటుఆవులు, గేదెలకు రూ.15వేలు బీమా చేస్తే మూడేళ్లకు ప్రభుత్వం రూ.768 ప్రీమియంలో సబ్సిడీగా ఇస్తుంది. పశుపోషకులు కేవలం రూ.192 తమ వాటా ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. మేలుజాతి రకం ఆవులు, గేదెలకు 30శాతం బీమా ప్రభుత్వం అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ పశుపోషకులు మూడేళ్లకు రూ.384 చెల్లిస్తే ప్రభుత్వం రూ.1536 ప్రీమియం భరిస్తుంది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న పశుపోషకులకు 50శాతం ప్రీమియం రాయితీ ఇస్తుంది. రూ.15వేల గేదెకు రూ.480 ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రైతులు మరో 480 చెల్లిస్తే మూడేళ్లకు బీమా వర్తిస్తుంది. పశువుకు రూ.30వేల బీమా చేస్తే రూ.960 రైతు, మరో రూ.960 ప్రభుత్వం చెల్లిస్తుంది. మూడేళ్లలో పశువులు మృత్యువాత పడితే బీమా మొత్తం అందుతుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు పశుబీమా వర్తిస్తుంది. 6నెలలు ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ.6వేలు బీమా ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం 80శాతం సబ్సిడీ ఇస్తుంది. సంవత్సరానికి రూ.36 పెంపకందారు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. దారిద్రరేఖకు ఎగువన ఉన్న లబ్ధిదారులకు 50శాతం బీమా ప్రీమియం ప్రభుత్వం భరిస్తుంది. సంవత్సరానికి రూ.90, మూడేళ్లకు రూ.188 చెల్లిస్తే సరిపోతుంది.

దగ్గరలోని పశువైద్యశాలలో రైతులు పశువులకు బీమా చేయించుకోవచ్చు. ప్రస్తుతం మేలు జాతి పశువుల ధర రూ.లక్ష వరకు ఉంది. ప్రభుత్వం రూ.30వేలు మాత్రమే బీమా వర్తింపచేస్తుంది. అదనంగా రూ.లక్ష వరకు బీమా కావాలంటే అధికంగా ప్రీమియం చెల్లించవలసి ఉంటుంది. పశువు విలువలో 6.4 శాతం ప్రీమియం చెల్లించాలి. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవిట్యాగ్ ఆధారంగా బీమా చెల్లిస్తారు. బీమా చేయించుకోవడానికి రైతులు ఆదార్‌కార్డు, బ్యాంకుపాస్‌బుక్, తెల్లరేషన్‌కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది.

ప్రతి పశువుకు బీమా చేయించండి

పశు పోషకులు ప్రతి పశువుకు బీమా చేయించాలి. పశువులు మృత్యువాత పడితే రైతు ఆర్థిక నష్టం లేకుండా ప్రభుత్వం పశుబీమా పథకం తీసుకొచ్చింది. ఆయా వర్గాల వారీగా 80శాతం, 50శాతం బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుంది. స్వల్ప ప్రీమియంతో మూడేళ్ల పాటు బీమా ఉంటుంది ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

గోవిందరాజు, జేడీ పశు సంవర్థక శాఖ

ఏలూరు జిల్లాలో పశువుల సంఖ్య	
ఆవులు	1,35,607
గేదెలు	5,06,110
గొర్రెలు	5,26,836
మేకలు	1,98,810



మే 7 నుంచి ట్రిపుల్ ఐటీకి సెలవులు

నూజివీడు టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లకు మే 7 నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులకు మే 7న పరీక్షలు ముగుస్తున్నందున సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్ పూర్తి చేసుకుని క్యాంపస్ నుంచి వెళతారని, సెమిస్టర్లలో ఉత్తీర్ణులకు వేసవిలో రెమిడియల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వేసవి సెలవుల్లో ఆన్‌లైన్ సమ్మర్ ప్రాసెస్ నిర్వహించడం జరుగుతుందని, విధివిధానాలను త్వరలో నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బ్రాంచ్ ఓరియంటేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందని, తర్వాత సెలవులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లలో జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

క్లస్టర్.. వీఆర్వో క్యాడర్‌కు కష్టం



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వీఆర్వోల సంఘ నాయకులు

భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియలో క్లస్టర్ విధానం వీఆర్వోలకు క్యాడర్‌కు ఇబ్బంది అని సంఘ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు సచివాలయాలను కలిపి క్లస్టర్‌గా చేసి ఒక వీఆర్వోను నియమించడంతో క్యాడర్ సామర్థ్యం తగ్గుతుందన్నారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు పలు సమస్యలను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో సుమారు 7,500 మంది క్యాడర్ సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. మిగిలిన వీఆర్వోలను ఏమి చేస్తారు, ఏ ప్రాతిపదికన ఎవరిని మండలాలు, మున్సిపాలిటీ నుంచి తీసుకుంటారా, వారందరికీ ప్రమోషన్లు కల్పిస్తారా, లేక మాతృశాఖలో విలీనం చేస్తారా స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అర్హులైన వీఆర్వోలకు సీనియార్టీ ప్రకారం ముందుగా ప్రమోషన్ కల్పించిన తర్వాతే రేషనలైజేషన్ ప్రక్రియలో క్లస్టర్‌కు ఒక వీఆర్వో ఉండేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వీఆర్వోలు ఇతర శాఖల పనులు, సర్వేలతో ఇబ్బంది పడుతున్నారని, క్లస్టర్ పేరుతో రెండు సచివాలయాలకు ఒక వీఆర్వోను నియమిస్తే రెవెన్యూ సేవలు పూర్తిగా ఆలస్యమవుతాయన్నారు. సచివాలయానికి ఒక వీఆర్వో విధానాన్ని కొనసాగించాలని కోరారు. క్యాడర్ సామర్థ్యం తగ్గితే భవిష్యత్‌లో ప్రమోషన్ పొందాల్సిన వీఆర్ఏలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య, భీమవరం, నరసాపురం డివిజన్ అధ్యక్షులు కెనడి, కె.సత్తిబాబు, అత్తిలి మండల అధ్యక్షుడు బాబులు, భూషణం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్

ఈడీగా ముక్కంటి

ఏలూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోలవరం కుడి కాల్వ పరిధిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.ముక్కంటిని ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియమితులయ్యారు. ఏలూరు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లా ఈడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వ సెక్రటరీ ఎంఎం నాయక్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏడాది కాలానికి ముక్కంటి డిప్యూటేషన్‌పై విధుల్లో నియమితులయ్యారు.

గత ఐదేళ్లు అరాచక పాలన

మాజీ ఎంపీ హరిరామజోగయ్య

పాలకొల్లు, మార్చి 17(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ అరాచక పాలనతో రాష్ట్రానికి రాజధాని కూడా లేకపోవడం దురదృష్టకరమని మాజీఎంపీ చేగొండి హరిరామ జోగయ్య అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి వద్ద రాజధాని నిర్మాణానికి శ్రద్ధ తీసుకోవడం, నిర్మాణానికి అవసరమైన నిధులు సేకరించడానికి ప్రయత్నాలు చేయడం రాజధాని పునర్నిర్మాణ పనులు ఏప్రిల్‌లో ప్రధాన మంత్రి మోదీతో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి వల్ల అటకెక్కిన రాజధాని నగరాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమేయంతో రాబోయే మూడేళ్లలో మనం చూడగలుగుతామని, ఈఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఆయన తెలిపారు.

లారీని ఢీకొన్న బైక్ : ఒకరి మృతి

కృత్తివెన్ను, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలోని లక్ష్మీపురం లాకు సెంటర్ వద్ద సోమవారం లారీని బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా నాగిడిపాలెం గ్రామానికి చెందిన వల్లభని రాధాకృష్ణ(57), బర్రె నర్సింహస్వామి (37) ద్విచక్రవాహనంపై వెళుతుండగా జరిగిన ప్రమాదరంలో రాధాకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నర్సింహస్వామిని 108లో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాధాకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రాధాకృష్ణ భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పైడిబాబు తెలిపారు.

ముగిసిన ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏలూరు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ల ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహిస్తోన్న పరీక్షలు సోమవారం ముగిశాయి. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఉదయం సెషన్ పరీక్షకు 182మంది అభ్యర్థులను కేటాయించగా 117మంది, మధ్యాహ్నం సెషన్‌కు 182మందికి 116మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదని నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్ బ్రిడ్జికోర్సు పరీక్షలకు 498మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో సోమవారం జరిగిన ప్రథమ సంవత్సరం బ్రిడ్జి కోర్సు పరీక్షకు జిల్లాలో 1743మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1245మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్‌విభాగంలో 10 మంది, ఒకేషనల్ విభాగంలో 1245మంది హాజరు కాగా 498మంది గైర్హాజరయ్యారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



సరిపల్లెలో నాగేశ్వరరావు మృతదేహం

గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన చనుమూరి నాగేశ్వరరావు (53)ను కారు ఢీకొనడంతో మృతి చెందారు. సరిపల్లె మాజీ సర్పంచ్ చనుమూరి పోతురాజు కుమారుడు నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తన ఇంటి వద్ద నడుచుకుంటూ వెళుతుండగా కారు అతివేగంగా నాగేశ్వరరావును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు.

వెళుతున్న ఆటో నుంచి కిందపడి..

జంగారెడ్డిగూడెం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా వెళుతున్న ఆటో నుంచి ప్రయాణికుడు కిందపడిపోవడంతో మృతి చెందాడు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మర్రి సీతయ్య (49) పొగాకు పనికి చల్లావారి గూడెం వచ్చాడు. సోమవారం బోసుబొమ్మ సెంటర్ నుంచి ఏపి 39 4126 నెంబరు ఆటోలో చల్లావారిగూడెం బయలుదేరాడు. ఆటో జల్లేరు బ్రిడ్జి దాటగానే డ్రైవర్ ఆటోను నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతో సీతయ్య కిందికి జారి పడ్డాడు. తీవ్ర గాయాలవడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడని హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గొలుసుతో బంధించబడిన బాలుడు (ఫైల్)

బాలుడిని గొలుసులతో బంధించిన వారిపై కేసు

నిడమర్రు మార్చి 17 (ఆంధ్రజ్యోతి): క్రొవ్విడి చేలల్లో చేపలు పట్టాడనే నెపంతో పదో తరగతి విద్యార్థిని గొలుసులతో బంధించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 'బాలుడిని కొట్టి.. కుక్క గొలుసుతో బంధించారు' శీర్షికన ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. ఈ కథనం ఆధారంగా విచారణ జరిపారు. క్రొవ్విడి గ్రామానికి చెందిన తాటిపర్తి బుజ్జన్న కుమారుడు లోకేశ్ వరణ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. బుజ్జన్న మేకలు మేపుకొంటున్న సమయంలో తన కుమారుడు వస్తానని చెప్పి ఎంతసేపటికీ రాలేదు. గండికోట వెంకన్న, గండికోట పాండు లోకేశ్‌ను బంధించి కోళ్లగాబుకు ఇనుప గొలుసుతో కట్టేశారు. గ్రామస్తుల చొరవతో విడిపించుకొని వెళ్లగా మళ్లీ కొల్లేరువస్తే చంపుతామని బెదిరించినట్లు బుజ్జన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



విరిగిన విద్యుత్ స్తంభం

పెనుమంట్ర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనుమంట్రలో రహదారి పక్కన విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ లారీ ఢీకొంది. విద్యుత్ స్తంభం విరిగిపోయినా తీగలు తెగిపడకపోవడం, స్తంభం గాలిలో వేలాడుతూ ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. స్తంభం పడిపోయినా, విద్యుత్ తీగలు తెగిపడినా ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం పెనుమంట్ర గ్రామ పంచాయతీ సమీపంలో ఇసుక లోడు లారీ వెనక్కి వెళుతూ పక్కనే విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో స్తంభం విరిగినా విద్యుత్ తీగల ఆధారంగా ఊగుతూ దర్శనమిచ్చింది. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు.

ట్రాలీ లారీని ఢీకొన్న మరో లారీ : డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



దెబ్బతిన్న ట్రాలీ లారీ, గాయపడిన డ్రైవర్

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బ్రిడ్జి మెయిన్ బైపాస్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ముందు వెళ్తున్న ఒక ట్రాలీ లారీని వెనుక నుంచి మరో ట్రాలీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీ కొన్న లారీ డ్రైవర్ మిర్యాలగూడనకు చెందిన రాజు(33) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు విజయవాడకు రిఫర్ చేయడంతో 108 అంబులెన్సులో తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేయలేదు.

భార్యాభర్తల కలహం

మహిళ ఆత్మహత్య

పెదవేగి, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : భార్య, భర్తల మధ్య కలహం చివరకు ఆత్మహత్యకు దారితీసింది. ఇద్దరి మధ్య గొడవతో మనస్తాపం చెందిన భార్య ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పెదవేగి మండలం బి.సింగవరం గ్రామానికి చెందిన పలగాని రాంబాబు, రామ తులసి భార్యాభర్తలు. వారికి 11ఏళ్ల క్రితం వివాహం కాగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇద్దరి మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన భార్య రామ తులసి, ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించే సరికే రామతులసి(29) మృతి చెందింది. ఆమె తండ్రి పరసా ఆశీర్వాదం ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు.

అక్రమ ఆయుధాలు

ఒకరి అరెస్టు

గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నారన్న సమాచారంపై గణపవరం పోలీసులు మెరుపు దాడి చేశారు. ఆయుధాలు కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై మణికుమార్ సోమవారం తెలిపారు. గణపవరానికి చెందిన జంబలవాల గోపి ఎటువంటి లైసెన్సులు లేకుండా రెండు నాటు తుపాకులు, మూడు నాటు తుపాకుల బట్‌లు కలిగి ఉన్నాడు. వాటిని స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామని ఎస్సై మణికుమార్ తెలిపారు.

మహిళల మెడలో మంగళ సూత్రాల చోరీ

జంగారెడ్డిగూడెం,మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండ రామాలయం వద్ద దొంగలు ఆరుగురి మహిళల మెడలో మంగళ సూత్రాలు కొట్టేశారు. ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాల్లో మహిళలు పూజలు చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మంగళ సూత్రాలను కట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత మహిళలు తమ మెడలో సూత్రాలు పోయాయని గుర్తించారు. రాజమండ్రి రత్నకుమారి మూడు కాసుల బంగారు తాడు, సూత్రాలు, అల్లాడ లక్ష్మికి చెందిన ఒక కాసు సూత్రాలు, సాయిల లక్ష్మికి చెందిన ఒక సూత్రం, తానింకి విజయకుమారి మెడలో ఒక కాసు సూత్రాలు, తలారి రత్నకుమారికి చెందిన సూత్రాలు, మరో మహిళ మెడలో సూత్రాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. సీఐ కృష్ణబాబు, ఎస్సై జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు జరుగుతుండగా చోరీ జరగడం భక్తులలో కలకలం రేపింది.

9 గ్రాముల బంగారు రింగులు..

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండ్ వద్ద సీఎంఆర్ జ్యూవెలరీ షోరూమ్‌లో రెండు ఉంగరాలు అపహరించారని త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 16న మధ్యాహ్నం ఒక వ్యక్తి ఉంగరాలు చూపించాలని అడిగాడు. ఖాతాదారుల రద్దీ ఉండడంతో ఆ వ్యక్తి రెండు ఉంగరాలు (9గ్రాముల బరువు) తీసుకుని వెళ్లిపోయాడు. సీఎంఆర్ మేనేజర్ జి బాలకృష్ణ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ వి కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై వచ్చి.. అడ్రస్ అడుగుతూ..

టి.నర్సాపురం, మార్చి 17(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వచ్చిన ఆగంతకులు అడ్రస్ అడుగుతూ మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించారు. ఏపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామానికి చెందిన కొలగాని లక్ష్మి, ఆమె భర్త లక్ష్మీనారాయణ మనవళ్లతో కలిసి ఆదివారం మోపెడ్‌పై కామవరపుకోట మండలం వెంకటాపురంలో కనకదుర్గమ్మ తిరునాళ్లకు వెళ్లారు. రాత్రి 10.50 గంటలకు తిరిగి వస్తుండగా మధ్యాహ్నపువారిగూడెం శివారులో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి అడ్రస్ అడిగారు. అంతలోనే మోపెడ్‌ను తన్నడంతో కిందపడిపోయారు. లక్ష్మి మెడలో 3కాసుల నాన్‌తాడు లాక్కుపోయారు. లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

ఏసీబీ కేసులో తప్పుడు సాక్ష్యం

- ఇద్దరికి జైలు శిక్ష

ఏలూరు క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధకశాఖ కేసులో తప్పుడు సాక్ష్యం చెప్పిన ఫిర్యాదుదారు, అతడితో పాటు సాక్షిగా ఉన్న మరొకరికి ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానం మూడు నెలలు జైలు శిక్ష శిక్ష విధించింది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన కంచెర్ల నాగలింగం వద్ద నుంచి 2006 అక్టోబర్ 23న ఏలూరు రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మారిశెట్టి పోతరాజు ఐదు వేల రూపాయలు లంచం తీసుకున్నారు. ఆ సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని మారిశెట్టి పోతురాజుపై కేసు నమోదు చేశారు. ఈకేసు విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ కొనసాగుతుంది. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన కంచెర్ల నాగలింగం, మరో సాక్షి అయిన గోగులగొండ బాబ్జీ కోర్టులో తప్పుడు సాక్ష్యం చెప్పారు. దీంతో విజయవాడలోని మూడో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో వారు తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు మూడు నెలల పాటు సాధారణ జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు కోర్టు సమయం ముగిసే వరకూ నిలబడి ఉండాలని ఈనెల 11న కోర్టు తీర్పు ఇచ్చిందని విజయవాడ ఏసీబీ ప్రధాన కార్యాలయాల ప్రజాపౌర సంబంధాల అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీబీ కేసులలో ఎవరైనా తప్పుడు సాక్ష్యం చెబితే ఇదే విధంగా శిక్షలు పడతాయని తెలిపారు.

పల్సర్ బైక్‌లో మంటలు



ఆకివీడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాహనదారు గుర్తించకున్నా స్థానికులు హెచ్చరించడంతో ప్రమాదం తప్పింది. స్థానిక పెద్దింట్లమ్మ వీధిలో యువకుడు సోమవారం పల్సర్ బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి మంటలతో కూడిన పొగ వచ్చింది. అదే ప్రాంతంలో ఆటో డ్రైవర్ గమనించి వాహనదారుని హెచ్చరించాడు. బండి ఆపి నీళ్ల పోయడంతో మంటలు ఆరాయి. షార్ట్ సర్క్యూట్ తో మంటలు వచ్చినట్లు గుర్తించారు.

మనమిత్ర వాట్సప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : మన మిత్ర వాట్సప్ పౌర సేవలను సద్విని యోగం చేసుకోవాలని జిల్లా కలెకర్ నాగరాణి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో మన మిత్ర-ప్రజల చేతిలో ప్రభుత్వం సమాచారం గోడ పత్రికను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రజలకు వివిధ సర్వీసులను వారి ఇంటి వద్దనే వాట్సప్ ద్వారా అందజేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. మన మిత్ర వాట్సాప్ నెం 9552300009 తొలి విడతలో 161 సేవలను అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందని తెలిపారు.

ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

మొగల్తూరు,మార్చి17.(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఇంటి పన్నులు వసూలు చేయడంలో వెనుకబడ్డ ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు అందించినట్టు ఈవోఆర్డీ నవీన్ కిరణ్ తెలిపారు. మండలంలోని కెపిపాలెం నార్త్ పంచాయతీ 30.79 శాతం, పేరు పాలెం సౌత్‌లో 44.05 శాతం మాత్రమే పన్నులు వసూలు చేశారన్నారు. దీంతో ఉన్నతాధి కారులు ఆయా కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు ఈవోఆర్డీ వివరించారు.

ముగ్గళ్ల అమ్మవారికి ప్రత్యేక పూజలు



గణపవరం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జాతరలు, తిరునాళ్ల నిర్వహించుకోవడం వలన ప్రజల్లో శాంతి సౌభాగ్యం వెల్లివిరుస్తోందని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. ముగ్గళ్ళ గ్రామదేవత శ్రీముగ్గళ్ల అమ్మవారి జాతర సందర్భంగా సోమవారం అమ్మవారిని వీరాంజనేయులు దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు ముచ్చర్ల వేణుగోపాల మురళీకృష్ణ, సర్పంచ్ పెంటబోయిన విమల పాల్గొన్నారు

ముగిసిన మదన గోపాలస్వామి ఉత్సవాలు

అత్తిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బల్లిపాడు మదనగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈనెల 7 నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో ఈనెల 9న స్వామి వారి కల్యాణం నిర్వహించారు. 10న రథోత్సవం ఘనంగా నిర్వహించారు. 11 రాత్రి పొన్న వాహనోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. 14న శ్రీ చక్రస్నానం, 15న పుష్పోత్సవం నిర్వహించారు. 16 నుంచి 3 రోజులు వళాయితీ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రతి రోజూ స్వామి వారిని, అమ్మవారిని వివిధ వాహనాలపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



కలవపూడిలో భీమేశ్వరస్వామి విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం.. గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

భీమేశ్వర స్వామికి వసంతోత్సవం

కాళ్ళ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కలవపూడిలో ఉమా భీమేశ్వరస్వామికి భక్తులు సోమవారం వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఉమా భీమేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు పూనుకున్నారు. దీనిలో భాగంగా 40 రోజులుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నామని, అవి సోమవారంతో ముగిశాయని పెద్దలు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

వెంకన్న ఆలయంలో హోమం

ఆచంట, మార్చి17(ఆంధ్రజ్యోతి): కొడమంచిలి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం హోమం నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువు మానేపల్లి ఉమా రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించగా కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం.. తల్లడిల్లుతున్న విద్యార్థులు



ఆకివీడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భానుడి ప్రతాపానికి విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. సోమవారం నుంచి పదోవతరగతి పరీక్షలు ఉదయం ప్రారంభం కావడంతో ఒంటిపూట బడులు మధ్యాహ్నం నుంచి పెట్టడం జరిగింది. సోమవారం ఆకివీడులో ఉష్ణోగ్రత 34 డిగ్రీలు ఉండడంతో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు గొడుగు తదితర వాటిని వినియోగించుకొని వెళుతున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోత భరించలేనంతగా ఉండడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో రహదారులు నిర్మానుషంగా మారుతున్నాయి.

విద్యార్థుల కోసం జ్ఞాన సరస్వతి హోమం



భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని జ్ఞాన సరస్వతి హోమం నిర్వహించారు. సోమవారం భీమవరం మెంటేవారితోటలోని విజయ గణపతి ఆలయంలో గొల్లవెల్లి శ్యామ్ వెంకట త్రియాన్స్, భక్తులు, రవీంద్ర భారతీ స్కూల్ విద్యార్థులతో జ్ఞాన సరస్వతి హోమం, మేథాశక్తి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 39 మందికి రూ.46,28,610 సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, చెనమల్ల చంద్ర శేఖర్, బండి రమేష్ కుమార్, పత్తి హరివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భూమి మనుగడ మన చేతుల్లోనే..

భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మన భూమి మనుగడ మన చేతుల్లోనే ఉందని, ప్లాస్టిక్ నిషేదిద్దామని వీఎస్‌కే కళాశాల సెక్రటరీ వబిలిశెట్టి పట్టాభిరామయ్య అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన కార్యక్రమాన్ని వీఎస్‌కె కళాశాలలో నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు. అనంతరం ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

మహిళల హక్కులపై అవగాహన ఉండాలి

పాలకొల్లు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (విజయవాడ) శోభన లక్ష్మీ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య వక్తగా శోభన లక్ష్మీ విచ్చేసి ప్రసంగించారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు పూర్తిగా చైతన్యం కావలసి ఉందని, యువత నడవడిక సక్రమంగా ఉండాలని సూచించారు కమిటీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఉషారాణి, కోఆర్డినేటర్ డాక్టర్ వి.యామిని పాల్గొన్నారు.

సోము వీర్రాజుకు సత్కారం



పాలకొల్లు రూరల్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): రెండవసారి శాసన మండలి సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజును సోమవారం బీజేపీ కృష్ణాజిల్లా ఇన్ చార్జి ఉన్నమట్ల కబర్ధి కలిశారు. తాడేపల్లిలోని సోము వీర్రాజు నివాసంలో కలిసి కబర్ధి ఆయనను సత్కరించారు.



ఆకివీడులో నోటీసు బోర్డులో నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు.. పోడూరులో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఫాజిల్.. భీమవరంలో తనిఖీ

టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతం

వసతులు కల్పించిన అధికారులు
కొన్ని చోట్ల విద్యార్థుల గైర్హాజరు

ఆంధ్రజ్యోతి -న్యూస్ నెట్‌వర్క్

ఆకివీడులో పదవతరగతి పబ్లిక్ పరీక్షలు మొదటిరోజు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షకు 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండల పరిధిలో నాలుగు పరీక్షా కేంద్రాలో పరీక్ష నిర్వహించారు. కాళ్ళ మండలంలో 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఏ.రవీంద్ర తెలిపారు. నరసాపురంలో ఎనిమిది సెంటర్లలో నిర్వహించిన పదోవ తరగతి పరీక్షలకు 1708మంది హాజరయ్యారు. 40మంది గైర్హాజరయ్యారు. హాల్ టిక్కెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే విద్యార్థుల్ని లోనికి అనుమతించారు. అన్ని కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను అమలు చేశారు. తణుకు డివిజన్ పరిధిలోని పలు పరీక్షా కేంద్రాలకు 10 వేల 609మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. వారిలో 10,463మంది హాజరయ్యారు. కేవలం 146మంది మాత్రమే గైర్హాజరయ్యారు. పాలకోడేరు మండలంలో 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి పెనుమత్స శివనాగరాజు తెలిపారు. ఉండి మండలంలో 13మంది గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారులు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో 15 మంది గైర్హాజరు అయ్యారు. పరీక్షలను ఎంఈవోలు గుమ్మళ్ళ వీరాస్వామి, ఆర్.గంగాధర శర్మ పర్యవేక్షించారు. ఆచంట మండలంలో 504 విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరైనట్టు ఎంఈవో ఎ. ఉషారాణి తెలిపారు. పోడూరు మండలంలో 11మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో విజయకుమార్ తెలిపారు. తహసీల్దార్ ఫాజిల్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. తాడేపల్లిగూడెం పట్టణంలో 38 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. తాడేపల్లిగూడెం మండలంలో 18 మంది పరీక్షకు హాజరు కాలేదు. పెంటపాడులో 20 మంది గైర్హాజరయ్యారు. తాడేపల్లిగూడెం జడ్పీఉన్నత పాఠశాల కేంద్రాన్ని తణుకు డీవైఈవో మురళీకృష్ణ పరిశీలించారు. పెనుగొండ మండలంలో 12 మంది గైర్హాజరైనట్టు ఎంఈవో సుభాకరరావు తెలిపా రు.పెనుమంట్ర మండలంలో ఏడుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. యలమంచిలి మండలో 11మంది గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

ఎండలో నిల్చొన్న విద్యార్థులు

మొగల్తూరు:మొగల్తూరు మండలం ము



ముత్యాలపల్లి ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారిపై ఎండలో విద్యార్థుల నిరీక్షణ

త్యాలపల్లి ఉన్నత పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నిర్ణీత సమయానికి ముందుగా వచ్చిన విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్ద నిరీక్షించారు. పరీక్షా కేంద్రం 216 జాతీయ రహదారిని అనుకుని ఉండటంతో పాఠశాల గేటు బయట జాతీయ రహదారిపై విద్యార్థులు వారి తల్లిదండ్రులు నిలబడ్డారు. ప్రతి క్షణం ట్రాఫిక్‌గా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డుపై నిలబడటం, ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని తల్లిదండ్రులు ఆవేదన చెందారు.

అడుగంటుతున్న చెరువులు



అడుగంటుతున్న భుజబలరాయుడు మంచినీటి చెరువు

ఆకివీడు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మంచినీటి చెరువులు అడుగంటుతున్నాయి. వంతులు విధానంలో రెండవ దఫా పూర్తియింది. పట్టణ పరిధిలోని ఇరవై వార్డుల ప్రజలకు భుజబలరాయుడు, భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకు, గాలిబ్, ఆనాల, ధర్మాపురం మంచినీటి చెరువుల ద్వారా ప్రజలకు నగర పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మంచినీటి చెరువులు నింపుకోవాలని ఉన్నతాధికారులు ఎప్పుడో ఆదేశాలు జారీచేసినా నేటికి నీటిని తోడడం, నింపుకోవడం సంబంధిత అధికారులు ప్రారంభించలేదు. ఆకివీడులో ఏడాది పొడవునా తాగునీటి సమస్యలున్నాయి, వేసవిలో తాగునీటి సమస్య మరింత తలెత్తుతుంది. అటువంటిది చెరువులను ముందుగానే నింపుకోవాల్సి ఉంది. ఇన్‌లెట్‌లు, అవుట్‌లెట్‌లు కూడా సక్రమంగా లేవు. నేటికి నింపుకోలేదు. ఈ చెరువులలో నీటిని నింపుకోవాలంటే నెలపైనే పడుతుంది. ఏప్రిల్‌లో కాలువలు బంద్ చేస్తారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటిని తోడడం మొదలు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్ర మంత్రి వర్మకు పరామర్శ



భీమవరం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ పరామర్శించారు. భీమవరంలోని భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసం వద్ద ఆయన్ని కలిసి కారు ప్రమాదం జరిగిన తీరును, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస వర్మ త్వరగా కోలుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్షించారు. అయితే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖకు సంబంధించి సభ్యుల ప్రశ్నలకు మంత్రిగా తాను సమాధానం చెప్పవలసి ఉండటంతో శ్రీనివాస వర్మ సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు.


ఎస్సీ వర్గీకరణ బిల్లును వ్యతిరేకించాలి



సమావేశమైన మాల మహానాడు నాయకులు

పాలకొల్లు అర్బన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రతి ఒక్కరూ తీవ్రంగా వ్యతిరేకించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేశ్ అన్నారు. రాజేశ్ నివాసంలో సోమవారం జరిగిన జిల్లా మాలమహానాడు కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గుండె నగేశ్ బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి రాజేశ్ మాట్లాడుతూ కుల గణన జరిపి అనంతరం జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో అన్నికులాలను వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెడుతున్నందున వ్యతి రేకిస్తూ మాలలు అందరూ ఏకతాటి మీదకు వచ్చి వ్యతిరేకించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి ప్రభాకరరావు, జిల్లా నాయకులు నల్లి సంజీవరావు, నల్లి జయరాజు, పాలపర్తి కృపాదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ విస్తరణ పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమణ సునీత దంపతులు

పాలకొల్లు టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) పాలకొల్లు ప్రెస్‌క్లబ్ భవనం విస్తరణ పనులకు సోమవారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ, సునీత దంపతులు భూమి పూజ నిర్వహించారు. బ్రహ్మశ్రీ నిట్టల శ్రీనివాస శర్మ బ్రహ్మత్వంలో గణపతి పూజ, వాస్తు పూజ, భూమి పూజ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మునిసిపల్ కమిషనర్ బి.విజయ సారథి, తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, పట్టణ సీఐ కె.రజనీ కుమార్ హాజరై కొబ్బరి కాయలు కొట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఐజేయు సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, జిల్లా సభ్యుడు పీటీ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు గోపి పాల్గొన్నారు.

ఆర్టిస్ట్స్ సంఘ భవనం..

స్థానిక ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ భవనం పైఅంతస్తుకు నిర్మాణానికి సోమవారం దాత పట్నాల కిషోర్ కుమార్ దంపతులు శంకుస్థాపన చేశారు. సంఘ సీనియర్ సభ్యులు కొరుకొండ సుబ్బారావు దంపతులు, గౌరవ అధ్యక్షుడు వల్లూరి రామబ్రహ్మం, అధ్యక్ష కార్యదర్శులు రవి, చంద్రరావు, కోశాధికారి సాంబమూర్తి సభ్యులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా సీఐ కె.రజనీ కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు విన్నకోట వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి



పాలకోడేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కుముదవల్లి గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు సాగి మధుసూదనరాజు (55) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం పొలానికి వెళ్ళేందుకు కారు నడుపుకుంటూ వెళ్తుండగా సాయంత్రం సమయంలో ఒక్కసారిగా గుండెపోటుతో కారులోనే కుప్పకూలిపోయారు. భీమవరం ఆసుపత్రికి తరలించగా మృతి చెందారని స్థానికులు తెలిపారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వైభవంగా శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ

పాలకోడేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరులో సోమవారం రామాలయ విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నరసాపురంలో వినతి పత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నరసాపురం టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్, సబ్‌కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ రాజరాజేశ్వరిలకు వినతిపత్రాలు ఇచ్చి తమ డిమాండ్లను వివరించారు. పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన డీఆర్ బకాయిలు వారి ఖాతాల్లో జమ చేయాలని, హెల్త్‌కార్డులపై వైద్యం అందించాలని విన్నవించారు.

ఆకివీడు: ఆకివీడు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావుకు రిటైర్డ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. 2023 జూలై నుంచి పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. డీఆర్, పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ అధ్యక్షుడు డీవీ రమణమూర్తి, అధ్యక్షుడు ఎం.జాబ్‌బాబు, కార్యదర్శులు ఏ.గాంధీబాబురాజు, ఎండీ సిద్దిఖ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం.రత్నకుమార్, పాల్ పాల్గొన్నారు.

అత్తిలి: అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ దశిక వంశీకి పెన్షనర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పెన్షనర్ల సంఘాధ్యక్షుడు పమ్మి గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ డీఆర్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. ఆరోగ్య కార్డులపై ఆసుపత్రుల వారు చికిత్స చేయడం లేదని తెలిపారు. నగదు రహిత చికిత్స చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి సమస్యను పరిష్కరించాలి: ఆర్డీవో

నరసాపురం టౌన్, మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదిదారుల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు పరిష్కరించాలని ఆర్డీవో దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 45 వినతులను స్వీకరించారు. కేపీపాలెంకు చెందిన రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని, చలవపేట, పొన్నపల్లి ప్రాంతాలకు చెందిన 50మంది శ్మశానవాటికలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పితాని శంకుస్థాపన



ఆచంట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు జడ్పీ నుంచి తెచ్చిన రూ. కోటి 4 లక్షల రూపాయలు నిధులతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పితాని ఆదివారం సాయంత్రం వల్లూరు, వేమవరం, ఆచంట, కొడమంచిలిలో ఎమ్మెల్యే పితాని కొబ్బరికాయ కొట్టి పనులకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

కాండం నుంచి అరటి గెల



తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులోని వాసా సోమేశ్వరరావుకు చెందిన ఇంటి పెరటిలో అరటి చెట్టుకు మధ్యలో నుంచి అరటి గెల పుట్టుకువచ్చింది. దీనిని ఆ ఇంటి చుట్టు పక్కల వారు విచిత్రంగా చూస్తున్నారు. అయితే అరటి చెట్టు మొవ్వ దెబ్బతినడం, మొవ్వకు కుళ్ల వ్యాధి సోకడం వంటి కారణాలతో అరటి చెట్టు కాండం భాగం నుంచి గెలలు వస్తాయని, ఇలా వచ్చిన అరటి గెలలు పూర్తిగా పక్వానికి రావని కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రం సైంటిస్ట్ మమత తెలిపారు.

\- తణుకు రూరల్

22న అత్తిలి మండల సమావేశం

అత్తిలి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22న జరుగుతుందని ఎంపీడీవో పి శ్యామ్యూల్ తెలిపారు. మండల అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

పరీక్ష సామగ్రి అందజేత

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు కొమ్ముగూడెం సర్పంచ్ తాడేపల్లి బేబి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించారు.

జనసైనికుడికి ఎమ్మెల్యే బొలిశెట్టి సాయం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):జనసేన ఆవిర్భావ వేడుకల్లో బారికేట్ పడటంతో గాయపడిన దండగ్రరకు చెందిన గాజుల సురేష్ కుటుంబానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సోవవారం ఆయన సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా రాంబాబు, గ్రామ జనసేన అధ్యక్షుడు కర్రి నాయుడు, సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నాగమణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి

బీజేపీ ఆకివీడు మండల అధ్యక్షురాలిగా నాగమణి

ఆకివీడు రూరల్ మార్చి 17(ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండల బీజేపీ అధ్యక్షురాలిగా అజ్జమూరు గ్రామానికి చెందిన ముదునూరి వెంకట సూర్య నాగమణి ఎన్నికైనట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి తెలిపారు. ఆకివీడు మండలం అజ్జమూరులో మండలపార్టీ అధ్యక్షులు కర్రెడ్డి ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు ఇంజేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ప్రతి పేదవాడికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందేవిధంగా పాటుపడాలని నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లూరి సాయిదుర్గరాజు, సుంకర కాశీ, సన్నిది మాణిక్యాలరావు, సత్యనారాయణరాజు, శివరామప్రసాద్, ఆదిశేషు, అప్పలరాజు పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

మొగల్తూరు, మార్చి17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. మోడి గ్రామానికి చెందిన దాసరి కృష్ణాజీ తనకు చెందిన 56 సెంట్లు స్థలాన్ని సర్వే చేసి న్యాయం చేయాలని, మరో ఇద్దరు వ్యక్తులు తమ స్థలాలు వివాదాల్లో ఉన్నాయని ఫిర్యాదు చేసినట్టు తహసీల్దార్ రాజ్ కిషోర్ తెలిపారు. తమకు గల ఉమ్మడి దారి మార్గంలో సరిహద్దుదారులు కొబ్బరి మొక్కలు నాటారని వాటి కారణంగా తమ నివాసాలకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, ఏవో రహీమ్, ఎంఈవో శామ్యూల్ జాన్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దుర్వినియోగమంటూ ఫిర్యాదు

పాలకోడేరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మోగల్లు పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగమైందని, వెంటనే విచారణ జరిపించాలని కోరుతూ ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొంత మంది ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోగల్లు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.సుజాత 2021-22 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ నిధుల నుంచి వర్క్ నిమిత్తం రూ. 27,45,609, ఖర్చుల నిమిత్తం రూ. 14,03,953 మొత్తం రూ. 41,49,562 తన సొంత ఖాతా అయిన సీఎఫ్ఎంఎస్ 1008209337 అకౌంట్ నంబర్ 39293760229 కి జమ వేసుకుని స్వాహా చేశారని సోమవారం గ్రామానికి చెందిన జాలే సునీత, కోనాల ప్రకాష్, ఐదవ వార్డు మెంబర్ పి.వెంకటరాజు, పి.వెంకట్రావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్న గంగరాజుకి ఇవ్వవలసిన బిల్లు అతనికి సొంత అకౌంట్ ఉన్నప్పటికి అతని అకౌంట్‌కి కాకుండా కార్యదర్శిగా పని చేస్తున్న సుజాత అకౌంట్‌కు వేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇలా మరికొన్ని ఆరోపణలు చేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

గుర్రపు డెక్కతో వర్మి కంపోస్టు తయారు

భీమవరం టౌన్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రయోగాత్మకంగా గుర్రపు డెక్కతో వర్మి కంపోస్ట్ తయారు చేయడానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గుర్రపు డెక్కతో వర్మి కంపోస్ట్ రూపొందించడానికి చర్చించారు. తదనంతరం గుర్రపుడెక్కతో ఆర్నమెంటల్ వస్తువులను తయారు చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఆకీవీడు మండలం సిద్ధాపురం గ్రామంలో తొలుత గుర్రపు డెక్క నుంచి వర్మికంపోస్ట్ తయారు చేయడాన్ని ప్రారంభిస్తామన్నారు.

సీతారామపురం క్లబ్‌పై దాడి: 11 మంది అరెస్టు

రెండు కార్లు, రూ.20,580 నగదు స్వాధీనం

మొగల్తూరు/నరసాపురం 17 (ఆంధ్రజ్యోతి):మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి సీతారామపురం స్పోర్ట్స్ క్లబ్‌పై సోమవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో జూదం ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద రూ.20,580 నగదు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. సుమారు రెండు మాసాల క్రితం ఇదే క్లబ్‌పై పోలీసులు చేసి జూదరులను అరెస్ట్ చేశారు. ఇక్కడ క్లబ్‌ను ఎత్తివేయాలంటూ పంచాయతీ కార్యదర్శి, పీజీఆర్ఎస్‌లోనూ గ్రామస్థులు ఫిర్యాదులు చేశారు. సోమవారం రాత్రి ఈక్లబ్‌పై మరోసారి దాడి చేయడం, ఈదాడిలో నరసాపురం డీఎస్పీ శ్రీవేద నేరుగా పాల్గొనడం తీరంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

భీమవరం క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారని భీమవరం టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు. పట్టణంలోని 32వ వార్డుకు చెందిన ఎం. బేబిపవన్, భార్య లక్ష్మి మరొక వ్యక్తి మోటార్ సైకిల్‌పై పెద అమిరం వెళ్తుండగా అడ్డవంతెన వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలుకాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

భీమవరం క్రైం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పరిధిలోని రాయలం గ్రామ పంచాయతీ ఉప్పుగుంటకు చెందిన బాలిక ఆదివారం తెల్లవారుజామున అదృశ్యమైనట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహ్మాన్ చెప్పారు. బాలికకు గతంలో పరిచయమైన హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో అదృశ్యమైనట్లు ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు.